వైసీపీకి ఓటమి భయం

● అందుకే అరాచకాలు సృష్టిస్తున్నారు
● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పులివెందులలో వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే అరాచకాలు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత తెలిపారు. శుక్రవారం కడపనగరం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో భాగంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు వేస్తారన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని గూండాగిరి చేసే వారమైతే నామినేషన్లు కూడా వేసే పరిస్థితి వైసీపీ వాళ్లకి ఉండదని చెప్పారు. అటువంటి సంస్కృతి తమది కాదని అది వైసీపీకే చెల్లుతుందని స్పష్టం చేశారు. గతంలో రాష్ట్రమంతటా వైసీపీ ఇదే విధానాన్ని అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతేడాది కాలం నుంచి వైసీపీ నేత జగన్‌మోహన్‌రెడ్డి వారి కార్యకర్తలను ఏ విధంగా రెచ్చగొడుతున్నారో రాష్ట్ర ప్రజలందరికి తెలుసునని చెప్పారు. రప్ప రప్ప అని నరికితే తప్పేముందని చెప్పడం దుర్మార్గమన్నారు. పులివెందులలో ఓడిపోతామని వైసీపీకి అర్థమైందని చెప్పారు. వైఎస్ వివేకానందరెడ్డి జయంతికి సొంత కూతుర్ని రావద్దని తల్లి చెబుతుందంటే పులివెందులలో పరిస్థితి ఏ విధంగా ఉందో పులివెందుల ప్రజలు తెలుసుకోవాలన్నారు. అంతిమంగా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. అలాగే చేనేతలకు సంబంధించి చేనేత కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వంఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు.

వైసీపీ దౌర్జన్యాలను అందరు చూస్తున్నారు

పులివెందుల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీ చేస్తున్న దౌర్జన్యాలను అందరు చూస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తామన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ఎన్నికలు చేయాల్సిన అవసరం లేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పులివెందుల ఉప ఎన్నికలు, ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తిచేయడమే లక్ష్యమని ఆయన కర్తవ్యబోధన చేశారన్నారు. పోలీసులను అసభ్యకరంగా మాట్లాడుతూ తిట్టడం, భయభ్రాంతులకు గురయ్యేలా ఎంపీ అవినాష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. 2019, 2024లో జగన్‌కు ఎన్ని ఓట్లు వచ్చాయో అందరం చూశామన్నారు. పులివెందులలో డైవర్షన్ పాలిటిక్స్‌కు వైసీపీ తెరలేపిందన్నారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలను బెదిరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పులివెందులకు వివేకా కుమార్తె రావద్దని తన తల్లే చెప్పిందంటే ఇక్కడి పరిస్థితి ఇట్టే అర్థమవుతుందోన్నారు. అనంతరం పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్లుగా అధికారంలో ఉంటూ మంచినీళ్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారని, వైసీపీ అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. బీటెక్ రవి సతీమణి లతారెడ్డి తప్పకుండా గెలుస్తుందన్నారు. చంద్రబాబు హయాంలో శాంతిభద్రతలు ఎప్పటికీ అదుపులోనే ఉంటాయన్నారు. వైసీపీ అరాచకాల కారణంగా 11 సీట్లకే పరిమితమయ్యారన్నారు. స్వాతంత్ర్య వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రచరిత్రలో ఇంత పెద్దఎత్తున స్ట్రైకరేట్‌తో విజయం సాధించిన పార్టీ ఎన్డీయే కూటమి అన్నారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రభుత్వ పాఠశాలలో...
మెరుగైన విద్యా ప్రమాణాలు
వివరాలు..........7లో



బెదిరింపుల కేసులో

వైఎస్ భాస్కర్‌రెడ్డికి నోటీసులు

పులివెందుల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల టీడీపీలో చేరిన మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డిని ఫోన్ ద్వారా బెదిరించిన కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డికి పులివెందుల పోలీసులు నోటీసులు అందించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్న వైఎస్ భాస్కర్‌రెడ్డికి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డికి 41ఏ నోటీసులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ శాఖలో.. వసూల్ రాజాలు

● కొత్తమీటర్ బిగించాలంటే ముడుపులు చెల్లించాల్సిందే
● భారీ భవంతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టకనే మీటర్లు
● ఫీల్డ్‌లో పర్యవేక్షించని అధికారులు

కొత్త ఇల్లు కట్టుకున్నారా.. విద్యుత్ మీటరు సర్వీసు కావాలా.. అయితే పైసలు కొట్టు అంటున్నారు విద్యుత్ శాఖలో కింది స్థాయి ఉద్యోగులు. నేరుగా ఆన్‌లైన్‌లో మీటరు సర్వీసుకు దరఖాస్తు చేసుకోవచ్చుకదా.. ఇంటి డాక్యుమెంట్లు, ఆధార్ సమర్పించి చలానా డబ్బులు చెల్లిస్తే విద్యుత్ మీటరు బిగిస్తారు కదా అనుకోవచ్చు. కానీ అవేమి ఇక్కడ చెల్లవు. వారడిగినంత ఇస్తేనే మీటరు బిగిస్తారు. లేదంటే మీ ఇంటికి ప్లాన్ ఉందా.. మున్సిపాలిటీ నుంచి ఎన్‌వోసి తెచ్చుకోండి లేదంటే మీటరు ఇవ్వరని బుకాయిస్తారు. అయినా ఇదేమి కొత్త కాదు అనవాయితీగా వస్తున్నదే అని సిబ్బంది సమర్థించుకుంటున్నారు. విద్యుత్‌శాఖలో వసూల్ రాజాలతో జనానికి అదనపు భారం తప్పడం లేదు.



ప్రొద్దుటూరు విద్యుత్ కార్యాలయం



ప్రొద్దుటూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు విద్యుత్ కార్యాలయ సబ్‌డివిజన్ పరిధిలో ఈస్ట్, వెస్ట్ సౌత్, నార్త్, రామేశ్వరం, రూరల్, రాజుపాలెం సెక్షన్లు ఉన్నాయి. ప్రతి సెక్షన్‌కు ఒక ఏఈ, సబ్ ఇంజనీరు, ఇద్దరు లైన్‌ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు లేదా నలుగురు లైన్‌మన్‌లు, పది మంది వరకు జూనియర్ లైన్‌మన్‌లు, హెల్పర్లు ఉంటారు. వారంతా ఆయా సెక్షన్ పరిధిలో సర్వీసులకు విద్యుత్ సరఫరా నిరంతరం జరిగేలా చర్యలు తీసుకుంటారు. అంతేకాకుండా విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు వాటికి మరమ్మతులు చేస్తారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. అలాగే కొత్తగా వెంచర్లు వేసి ఇళ్ల నిర్మాణమైన చోట స్తంభాలు నాటి లైన్లు లాగుతారు. ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చుతారు. ప్రొద్దుటూరు టౌన్‌లో 75,857 సర్వీసులు, రూరల్ పరిధిలో 40,002 సర్వీసులు ఉన్నాయి.

మీటరు సర్వీసుకు రూ.10వేలు

ప్రొద్దుటూరు పట్టణంలో కొత్తగా ఇల్లు కట్టుకుంటుంటే విద్యుత్ సిబ్బంది నేరుగా భవన యజమానిని సంప్రదిస్తారు. మీటరు బిగించుకుని సర్వీసు తీసుకోమని చెబుతారు. మీటరుకు రూ.10వేలు అవుతుందని, డబ్బు తమ చేతికే ఇవ్వమని చెబుతారు. ఇంటి డాక్యుమెంటు, ఆధార్‌కార్డు తీసుకుంటారు. మీసేవలో వారే వెళ్లి దరఖాస్తు సైతం చేసి, ఆ తరువాత మీటరు తెచ్చి బిగిస్తారు. ఇదేమిటి.. మీటరుకు పదివేలా...? అంటే మాత్రం సర్వీసు ఇవ్వకుండా చుక్కలు చూపిస్తారు.

ముఖ్యంగా కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టి సర్వీసులు తీసుకునే యజమానులను టార్గెట్ చేసుకుని విద్యుత్ శాఖ సిబ్బంది ఈ అవినీతి దందా సాగిస్తున్నారు. ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలో కింది స్థాయి సిబ్బంది చాలా మంది ఈ తరహా అవినీతికి పాల్పడుతున్నారు. మూడు వారాల క్రితం జంగంపేటలో రేకుల ఇళ్లకు మీటరు సర్వీసులు బిగించమని అడిగితే విద్యుత్ సిబ్బంది ఒక్కొక్క మీటరుకు రూ.10వేలు ఇవ్వమని డిమాండ్ చేశారు. తను నేరుగా వెళ్లి మీసేవలో మూడు మీటర్లకు చలానాలు కట్టాడు. మూడు మీటర్లకు కలిపి కూడా రూ.6వేలు మాత్రమే అయింది. చలానాలు కట్టాను మీటరు బిగించాలని విద్యుత్ సిబ్బందిని కోరితే మీ ఇంటికి మున్సిపాలిటీ ప్లాను లేదు. మున్సిపాలిటీ నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని చెప్పి మీటరు సర్వీసు ఇవ్వకుండా వేధించారు. దీంతో విద్యుత్ కార్యాలయ ఉన్నతాధికారికి ఆ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఆ అధికారి వెంటనే సంబంధిత సెక్షన్ ఏఈకి చెప్పి మీటర్లు బిగించమని ఆదేశించారు. సిబ్బందిని పిలిచి కార్యాలయం ఉన్నతాధికారి తీవ్రంగా మందలించారు తప్ప లంచం డిమాండ్ చేసినందుకు చర్యలు తీసుకోలేదు.

ట్రాన్స్‌ఫార్మర్ పెట్టకనే మీటర్లు

భారీ భవంతులు నిర్మించి అందులో పది నుంచి పదిహేను ప్లాట్లు ఉంటే ఆ భవనం లోడును బట్టి కచ్చితంగా ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి. 25 కిలోవాట్స్ దాటితే ఏ భవనానికైనా ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి. 25 కిలోవాట్స్ టాన్స్‌పార్మర్ బిగించాలంటే రూ 2లక్షల వరకు ఖర్చు అవుతుంది. కానీ ప్రొద్దుటూరు పట్టణంలోని చాలా భవనాలకు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించకనే నేరుగా సర్వీసులు ఇచ్చి మీటర్లు బిగించి పెద్ద ఎత్తున చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలున్నాయి. కొందరు లైను ఇన్‌స్పెక్టర్లు ఏఈలు ఇలాంటి వాటిని అరికట్టవలసింది పోయి తిలాపాపం తలాపిడికెడు చందంగా జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల వెంకటేశ్వర్ల పేటలోని మున్సిపల్ స్కూలు ఎదురుగా పదిసెంట్లకు పైగా స్థలంలో భారీ భవంతి నిర్మించారు. అందులో పదిలోపు ప్లాట్లు ఉన్నాయి. వాటికి 40 కిలోవాట్ల వరకు లోడు ఉంటుందని చెబుతున్నారు. కానీ ఆ భవంతికి ఎలాంటి ట్రాన్స్‌ఫార్మర్ బిగించకనే మీటరు సర్వీసులు ఇచ్చారు. ఇందులో ఆ సెక్షన్ అధికారులు, లైన్‌మెన్, సిబ్బందికి కలిపి రూ.లక్షలు అందాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్ పెడితే..

భారీ భవంతులకు, అపార్ట్‌మెంట్లకు ట్రాన్స్‌ఫార్మర్ పెడితే మీటర్లు సాధారణంగా ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ట్రాన్స్‌ఫార్మర్‌కు కట్టిన డబ్బులతో పాటు అదనంగా ప్రతి మీటరు సర్వీసుకు డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు విద్యుత్ సిబ్బందిపై ఆరోపణలు ఉన్నాయి.

అదనపు వసూళ్లు చేస్తే చర్యలు తప్పవు..

కొత్తమీటరు సర్వీసులకు ప్రభుత్వం నిర్ణయించిన చలానాలు తప్ప అదనంగా లైన్‌మెన్లు ఇతర సిబ్బంది వసూలు చేస్తే చర్యలు తప్పవు. మా దృష్టికి వినియోగదారులు నేరుగా తీసుకొస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. భారీ భవంతులకు ట్రాన్స్‌ఫార్మర్ బిగించకుండా మీటరు సర్వీసులు ఇవ్వరాదు. అలా ఇచ్చివుంటే అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం.

- రమణారెడ్డి, ఈఈ, డివిజన్ విద్యుత్ కార్యాలయం, ప్రొద్దుటూరు

ఓటు వేసేందుకు మరో గ్రామానికి వెళ్లాలా ?

● కలెక్టర్‌ను చుట్టుముట్టిన నల్లగొండువారిపల్లె ప్రజలు

పులివెందుల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఓటు వేయకుండా మరో గ్రామానికి వెళ్లి ఓటు వేయడం ఏంటని నల్లగొండువారిపల్లె గ్రామ ప్రజలు కలెక్టర్ ముందు ఆందోళనకు దిగిన సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్, ఆర్డీఓ చిన్నయ్యతో కూడిన బృందం నల్లపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె, నల్లగొండువారిపల్లె, మోట్నూతలపల్లె తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంలో నల్లగొండువారిపల్లెలో కలెక్టర్‌కు నిరసన ఎదురైంది. ఓటర్లను ఈ గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రంలో కాకుండా పక్కనున్న నల్లపురెడ్డిపల్లెలో ఉన్న పోలింగ్ కేంద్రానికి బదిలీ ఎందుకు చేశారని వారు ప్రశ్నించారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇబ్బంది ఉంటుందని, అలా కాకుండా తమ గ్రామంలోనే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అం దుకు ఆయన స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా పోలింగ్ కేం ద్రాల్లో ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి, వసతులు తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళినాయక్ తదితరులు పాల్గొన్నారు.




పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్

నువ్వా.. నేనా

● జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ వర్సెస్ వైసీపీ
● ముమ్మరంగా ప్రచారం
● టీడీపీ నుంచి మంత్రులు, వైసీపీ నుంచి కీలక నేతలు
● ఇంటింటా ప్రచారం
● సునీత వ్యాఖ్యలతో వైసీపీ శ్రేణుల్లో కలవరం
● పులివెందులలో టెన్షన్ టెన్షన్
● స్వతంత్ర అభ్యర్థులకు గన్‌మెన్‌ల భద్రత
● ఒంటిమిట్ట టీడీపీలో నేతల మధ్య కోఆర్డినేషన్ కరువు
● రేపే ప్రచారానికి తెర





(కడప - ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల తరువాత జిల్లాలో జరుగుతున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. రెండు చోట్ల, టీడీపీ, వైసీపీ నువ్వా, నేనా అన్నట్లుగా పోటీ పడుతున్నాయి. ఈ రెండు సిట్టింగ్ స్థానాలు గతంలో వైసీపీవే. అయితే అప్పట్లో జగన్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ విధంగా జరిగాయో మనం చూసిందే. ఈ నెల 12న పోలింగ్ జరగనుంది. ఓటింగ్ దగ్గర పడుతుండడంతో ఈ ఎన్నికలు కాక రేపుతున్నాయి. పులివెందుల ఉప ఎన్నిక మాజీ సీఎం జగన్‌కు జీవన్మరణ సమస్యగా మారింది. ఉమ్మడి సొంత జిల్లాలో గత ఎన్నికల్లో ఏడు స్థానాలను వైసీపీ కోల్పోయి మైండ్‌బ్లాక్ అయింది. ఇప్పుడు సొంత జిల్లాలో ముఖ్యంగా సొంత గడ్డలో జరిగే ఉప ఎన్నిక టీడీపీ అనూహ్యంగా పుంజుకుని భారీ స్థాయిలో పోటీనిస్తూ నువ్వా నేనా అన్నట్లుగా తీవ్ర పోటీనిస్తుంది. వైసీపీ నుంచి టీడీపీలోకి క్యూ కడుతున్నారు. ఈ జగన్ అండ్ కోను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ నేపథ్యంలో దివంగత వివేకా కూతురు డాక్టర్ సునీత వివేకా మర్డరుపై చేస్తున్న కామెంట్స్ వైసీపీలో ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఇక పులివెందులలో మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మాధవీ, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, వైసీపీ నుంచి మాజీ ఎంపీ అవినాష్‌రెడ్డి, గోరంట్ల మాధవ్, ఇక ఒంటిమిట్టలో మంత్రులు ఫరూక్, బీసీ జనార్ధనరెడ్డిలు ఇతర టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించారు.

పులివెందులలో పోటాపోటీ

పులివెందుల ఉప ఎన్నిక టీడీపీ, వైసీపీ మధ్య నువ్వా నేనా అన్నట్లుగా సాగుతుంది. నిన్నటి వరకు ఇది వైసీపీకి కంచుకోటగా ఉండేది. అయితే మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వ్యూహాత్మకంగా వ్యవహరించి వైసీపీ నుంచి పెద్దఎత్తున టీడీపీలోకి జాయిన్ చేసుకున్నారు. రోజూ చేరికలతో టీడీపీలో జోష్ నింపుతుంది. ఎలాగైనా సరే సిట్టింగ్ స్థానాలను నిలుపుకోవాలని వైసీపీ చూస్తుంది. మాజీ సీఎం జగన్ సూచనల మేరకు ఎంపీ అవినాష్‌రెడ్డి ఇతర వైసీపీ నేతలు ముందుకెళ్తున్నారు.

వైసీపీలో కలవరం

వివేకా జయంతి సందర్భంగా పులివెందులకు వచ్చిన డాక్టర్ సునీత వివేకా హత్య గురించి చేసిన వ్యాఖ్యలు వైసీపీలో కలవరానికి గురి చేస్తున్నాయి. వివేకా హత్యలో ఎంపీ అవినాష్ ప్రమేయం, చనిపోయిన రోజు కనీసం ఊరేగింపు కూడా జగన్ చేయలేదంటూ జగన్‌పైన, పులివెందులలో హత్య రాజకీయాలు మారాలంటూ చేసిన వ్యాఖ్యలు వైసీపీ నేతలను టెన్షన్‌లో పడేశాయి. పులివెందులలో వరుసగా రెండురోజుల పాటు టీడీపీ, వైసీపీ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.

స్వతంత్ర్య అభ్యర్థులకు గన్‌మెన్‌లు

పులివెందులలో ఉప ఎన్నిక తీవ్ర ఉద్రిక్తతకు దారి తీస్తుంది. ఈ నేపథ్యంలో బరిలో ఉన్న 8 మంది స్వతంత్ర్య అభ్యర్థులకు గన్‌మెన్ సౌకర్యం కల్పించారు.

రవాణా సదుపాయం

ఈ నెల 12న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను జిల్లాకు పోలింగ్ రోజున రప్పించేందుకు గానూ వారికి అవసరమైన రవాణా సదుపాయాన్ని చేస్తున్నారు. రానూ పోనూ వాహనాలకు అయ్యే ఖర్చును ఇప్పటికే ఓటర్ల అకౌంటులో జమ చేశారు.

ఒంటిమిట్టలో గ్రూపు తగాదాలు

ఒంటిమిట్టలో పోరు నువ్వా నేనా అన్నట్లుగా సాగుతుంది. టీడీపీలో స్థానిక నేతల మధ్య కోఆర్డినేషన్ కరువైంది. ఇక్కడ లోకల్ గ్రూపులు టీడీపీకి పెద్ద మైనస్‌గా మారాయి. ఇక్కడ పోలింగ్ కోసం పలువురిని ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అయితే కొందరు సీనియర్ నేతలకు చోటు కల్పించలేదనే అసంతృప్తి ఆ పార్టీలో ఉంది. ఇక ఇన్‌చార్జ్ మంత్రులు కూడా ఆలస్యంగా ప్రచారానికి వచ్చారు. శుక్రవారం మంత్రులు ఫరూక్, బీసీ జనార్ధనరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు, ఇతర ముఖ్య నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఒంటిమిట్టలో పోలింగ్‌కు గడువు దగ్గర పడుతుంది. ఒంటిమిట్టలో టీడీపీ నేతలను సయోధ్యపరచి అందరినీ పోలింగ్‌కు సిద్ధం చేయాల్సిన బాధ్యత మంత్రులపై ఉంది. ఇక్కడ వైసీపీ ముమ్మరంగా ప్రచారం చేస్తూ ముందంజలో ఉంది. ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, ఇతర వైసీపీ నేతలు ఎన్నికల్లో వ్యూహాలు రూపొందించుకుంటూ ముందుకెళుతున్నారు. టీడీపీకి గ్రూపు తగాదాలు కూడా సమస్యగా మారింది.



విజయదుర్గాదేవి ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

వరలక్ష్మీ.. నమోస్తుతే

● జిల్లాలో ఘనంగా వరలక్ష్మి వ్రత వేడుకలు ● భక్తజనంతో అమ్మవారి ఆలయాలు

కడప కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వరలక్ష్మి వ్రత పర్వదినం సందర్భంగా జిల్లాలో వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచే అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనం కోసం ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేసి ఆ తల్లి సేవలో తరించారు. ఈ క్రమంలో కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు, తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మి పూజలు చేశారు. ఇందులో భాగంగా నగర అమ్మవారిశాలవీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, విజయదుర్గాదేవి ఆలయం, రాజరాజేశ్వరిదేవి ఆలయం, మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, దేవునికడప శివాలయం, ఎర్రముక్కపల్లెలోని చౌడేశ్వరిదేవి ఆలయం, ఆలంఖాన్‌పల్లెలోని శివాలయం తదితర ఆలయాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.





దేవునికడప ఆలయంలో మహిళలకు సౌభాగ్యం అందిస్తున్న దృశ్యం



ప్రొద్దుటూరు వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో పుష్పాలంకరణలో అమ్మవారు

మహిళలకు సౌభాగ్యం

వరలక్ష్మివ్రతం సందర్భంగా దేవు నికడప ఆలయంలో శుక్రవారం మహిళలకు సౌభాగ్య కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మంలో మహిళలకు అమ్మవారి కుం కుమ, గాజులు, పసుపు దారంతో పా టు కంకణాలను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టరు ఈశ్వర్‌రెడ్డి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంతరిస్తున్న మామిడి తోటలు

● చెట్లను నరికేస్తున్న రైతులు



లారీల్లో తరలిస్తున్న నరికేసిన మామిడి చెట్లు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలకు పెట్టింది పేరుగా చెప్పుకునే రైల్వేకోడూరు నియోజకవర్గంలో తోతాపురి, బంగినపల్లి, నీలం, రుమాని, చెరుకు రసం, హిమామ్ పసంద్ వంటి పలు రకాల మామిడికాయలు పండిస్తారు. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, గుజరాత్ వంటి రాష్ట్రాలకు ఇక్కడి నుంచి మామిడికాయలు ఎగుమతి అవుతాయి. దీంతో ప్రతి ఏడాదీ రూ.100 నుంచి రూ.150 కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఈ ఏడాది మామిడి రైతులకు కష్టకాలం వచ్చింది. పంట దిగుబడి బాగానే ఉన్నా ధర పడిపోయింది. దీనికి తోడు కూలి, రవాణా ఖర్చులు కూడా పెరిగిపోవడంతో పాటు, దళారుల కారణంగా రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. కొంతమంది రైతులు మామిడి తోటలను వదిలేసి వెళ్లిపోవడంతో టన్నుల కొద్దీ కాయలు చెట్లకే వేలాడుతూ మగ్గిపోయాయి. ఇలాంటి దుర్భర పరిస్థితుల గతంలో ఎప్పుడు చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడూరు మార్కెట్లో ఈ ఏడాది కేవలం 50 కోట్ల రూపాయల వ్యాపారం మాత్రమే జరిగింది. ఇది గతంతో పోలిస్తే చాలా తక్కువ. రైతుల కష్టాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడికాయకు కిలోకు రూ.8 ప్రోత్సాహకం ప్రకటించింది. అయితే, జ్యూస్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు సిండికేట్‌గా మారి తక్కువ ధరకే మామిడి కాయలను కొనుగోలు చేస్తుండటంతో ఈ ప్రోత్సా హకం పెద్దగా ఉపయోగపడలేదు. కలెక్టర్ స్వయంగా రైతుల వద్దకు వచ్చి సమస్యలు పరిశీలించి, గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ ఇంకా అమలు కాలేదు. ధరలు లేకపోవడం, దళారుల దోపిడీ, ప్రభుత్వం నుంచి సరైన మద్దతు లభించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

మామిడి తోటల సాగుకు రైతులు ఒక్కో ఎకరానికి సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఖర్చు అవుతుంది. దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడం మార్కెట్లో ధరలు అస్థిరంగా ఉండటంతో పెట్టుబడి కూడా రావడం లేదని నిరాశకు గురవుతున్న రైతులు కొంతమంది తోటలను నరికివేస్తున్నారు. వచ్చే ఏడాది లోగా మామిడి రైతుల సమస్యలపై అధ్యయనం చేసి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యాలు, సబ్సిడీలు, సకాలంలో రుణాలు వంటి చర్యల ద్వారా ప్రభుత్వం మామిడి రైతులకు అండగా నిలబడాలి లేదంటే కోడూరు మామిడి పంటకు గడ్డుకాలం తప్పదు.

గిట్టుబాటు ధర వస్తుందన్న ఆశలేదు...

గత ఏడాది కంటే ఈ ఏడాది మామిడి దిగుబడి బాగానే వచ్చింది. అయితే గిట్టుబాటు ధర మాత్రం రాలేదు. దళారులు, జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం సిండికేట్‌గా మారి రైతులను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం హెచ్చరించినా వారు సహకరించడం లేదు. మార్కెట్‌లో ఒక వ్యాపారి నుంచి ఇంకో వ్యాపారి వద్దకు సరుకు తీసుకెళ్తే నిర్మొహమాటంగా వద్దంటున్నారు. కనీసం మామిడి తోటలపై పెట్టిన ఖర్చు రావడం లేదు. అందుకే మామిడి చెట్లను నరికేస్తున్నానని ఓబులవారిపల్లి మండలం, వై.కోటకు చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



వై.కోట గ్రామంలో రైతు నరికేసిన మామిడి చెట్లు

ప్రతి ఏడాది తగ్గుతున్న విస్తీర్ణం

నియోజకవర్గంలో ప్రస్తుతం 22 వేల ఎకరాలో మాత్రమే మామిడి తోటలు ఉన్నాయి. ఐదేళ్ల క్రితం సుమారు 27 వేల ఎకరాల్లో ఉన్న మామిడి తోటలు క్రమంగా తగ్గుతూ వచ్చి ఈ ఏడాదికి 22 వేల ఎకరాలకు పరిమితమయ్యాయి. గత ప్రభుత్వంలో కొంత భూమి నేషనల్ హైవేకు పోవడంతో ఎక్కువ శాతం మామిడి చెట్లను తొలగించారు. చీడ పీడలు, తెగుళ్లు సోకి, చెట్లు ఎండిపోతు న్నాయి. దీంతో దిగుబడి తగ్గిపోవడమే కాకుండా చెట్లు కూడా చనిపోతున్నాయి. ఈ సమస్య వలన రైతులు చెట్లను నరికేస్తున్నారు.

- భాస్కర్, ఉద్యానశాఖ అధికారి

ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, దేవళం వీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి దేవస్థానానికి ధర్మకర్త మండలి నియామకం కోసం విజయవాడ దేవాదాయ శాఖ కమిషనర్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 26వ తేదీలోపు ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి కోసం ఆశావహులు అన్నమయ్య జిల్లా, రాయచోటిలోని జిల్లా దేవాదాయ శాఖ అధికారి కార్యాలయానికి చేరేలా దరఖాస్తు సమర్పించాలని కోరారు. లేటుగా చేరిన, చేర్చిన దరఖాస్తులు చెల్లవని మదనపల్లె గ్రూప్ టెంపుల్ ఈఓ రమణ ఓ ప్రకటనలో వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బస్సుకింద పడి చిన్నారి మృతి చెందిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక విజయవాణి పాఠశాల బస్సు డ్రైవరు నిర్లక్ష్యానికి నాలుగేళ్ల చిన్నారి దివాకర్ మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. పాఠశాల వ్యాన్‌కు క్లీనర్‌ను ఏర్పాటు చేయకపోవడమే ప్రధానం కారణంగా విద్యార్థి మృతి చెందడంతో బాధితుల ఫిర్యాదుపై పాఠశాల కరస్పాండెంట్ రఘుపతినాయుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు నాయుడు, డ్రైవర్ గురుప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దౌర్జన్యం చేసిన నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తట్టివారిపల్లె బైపాస్ రోడ్డులో గురువారం పశువులు తరలిస్తున్న లారీని ఆపి, వారిపై దౌర్జన్యం చేసి పదివేలు డబ్బు డిమాండ్ చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె తాలుకా పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం, తిరువన్నామలై జిల్లా, అరణితాలుకా మయూరు వాసులు బాలాజీ, కమలకన్నన్ రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం అనంతపురం జిల్లా గోరెంట్ల పశువుల సంత నుంచి రెండు ఎద్దులు, ఒక ఆవు, రెండు దూడలు తరలిస్తున్నారు. వీరి వాహనం చైన్నై- ముంబై జాతీయ రహదారి తట్టివారిపల్లె వద్ద ఆర్టీఓ ఆఫీస్ వద్ద మదనపల్లె వాసులు చేగూరి నాగార్జున, సురేష్‌కుమార్ రైతుల వద్ద నుంచి పశువులకు సంబంధించిన పేపర్స్ లొక్కుని, చంపుతామని బెదిరించి, పదివేలు రూపాయలు డిమాండ్ చేశారు. అనంతరం వారి అధీనంలోని వాహనాన్ని పట్టణంలోకి రాకుండా బైపాస్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో నిలిపి వాహనంలోని కమలకన్నన్ మొబైల్ ఫోన్స్ ద్వారా ఓనర్ మురళీదాస్ మాట్లాడి పశువులను ఇక్కడే వదిలేసి వెళ్లాలని డిమాండ్ చేశారని తెలిపారు. వారు ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో తాలుకా సీఐ కళా వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో గాలిబండకు ముళ్ల కంచె



హార్సిలీహిల్స్‌లోని గాలిబండ వద్ద ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వద్ద సీఐ జీవన్ గంగనాథబాబు

బి.కొత్తకోట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల ఆకర్షణ కోసం రూ.లక్షలతో సుందరీకరణ పనుల చేపట్టిన విషయం తెలిసిందే. వీటిని రెండు రోజుల కిందట కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రారంభించారు. పర్యాటకుల రక్షణ, కొండ మీద పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటించారు. రాత్రి పూట డీఎస్పీతో కలసి స్వయంగా హిల్స్ పైనున్న ప్రధాన కూడళ్లు సహా గాలిబండను పరిశీలించి మందుబాబులు గాలిబండ పైకి వచ్చి బహిరంగంగా మద్యం సేవించే విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. రక్షణ పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆదేశాల్లో భాగంగా గాలిబండ ముఖద్వారంలో రాతి కూసాలు నాటించి ఫెన్సింగ్ వేయించారు. గురువారం బి.కొత్తకోట సీఐ జీవన్ గంగనాథబాబు హార్సిలీహిల్స్‌లో ఫెన్సింగ్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇకపై హార్సిలీహిల్స్‌లో విచ్చలవిడిగా మద్యం వినియోగం, ఆకతాయి చేష్టలపై పోలీసుల నిఘా వుంటుందన్నారు. పర్యాటకులు తమ తోటి వారికి ఇబ్బంది కలగకుండా హిల్స్ పర్యటన ముగించుకుని వెళ్లాలన్నారు.

యువకుడి బొటనవేలు కొరికేసిన కానిస్టేబుల్





వినోద్ బొటనవేలుకి గాయమైన దృశ్యం, కానిస్టేబుల్ వినోద్‌కుమార్

వీరబల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో ఏర్పడిన తగాదా కారణంగా ఓ కానిస్టేబుల్ ఓ యువకుడిపై దాడి చేయడంతో పాటు అతని బొటన వేలిని కొరికి వేశాడు. మండలంలోని ఈడిగపల్లికి చెందిన వెంకటేశ్వర్లు విజయవాడలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తు న్నాడు. శుక్రవారం తన కుమారుడు వినయ్‌తో కలసి వినోద్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన కారుపై దాడి చేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన వినోద్‌కుమార్ ఎడమ చేతి బొటన వేలిని వెంకటేశ్వర్లు కొరికివేశాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హాకీ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన జట్లతో జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు

రాయచోటిటౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ (శాప్) శుక్రవారం రాయచోటి పట్టణంలోని రాజు ఒలంపియాడ్ స్కూల్ సమీపంలోని హాకీ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి పోటీలకు హాకీ క్రీడాకారులను ఎంపిక చేసింది. ఎంపికైన జట్లు త్వరలో తిరుపతిలో జరగనున్న జోనల్ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటాయి. అన్నమయ్య జిల్లా హాకీ సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు, జిల్లా హాకీ ఫౌండర్ సీ. చంద్రశేఖర్, శాప్ కోచ్ చంద్రశేఖర్, రాజు స్కూల్ హాకీ కోచ్ నారాయణ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు.

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం

ములకలచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శుక్రవారం తెల్ల వారుజామున భారీ వర్షం కురిసింది. భారీ ఉరుములు, మెరుపులతో కూడి వర్షం కురవడంతో జనం భయాందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా ఉరుములు రావడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పెద్దమండ్యంలో 57.8 మి.మీటర్లు, బి.కొత్తకోటలో 55 మి.మీటర్లు, ములకలచెరువులో 42 మి.మీటర్లు, పెద్దతిప్పసముద్రంలో 37 మి.మీటర్లు, తంబళ్లపల్లెలో 36.4 మి.మీటర్లు, కురబలకోటలో 10 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో ప్రధాన వీధులు వర్షపు నీరు పొంగి పొర్లాయి. మురికినీట కాల్వలు పొంగి వీధుల్లో ప్రవహించాయి. ములకలచెరువులో ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయి.

యూరియా కోసం రైతుల నిరీక్షణ





టమోటా చెట్లు పీకేసి వరి సాగుకు సిద్ధంగా ఉన్న పొలం, యూరియా కోసం దుకాణం ముందు వేచి ఉన్న రైతులు

● అరకొరగా యూరియా నిల్వలు

రామసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరి పంటలకు యూరియా వాడకం ఎక్కువగా ఉండడంతో కాలిఫ్లవర్, కొత్తమీర, బీన్స్ తదితర పంటలకు యూరియా వాడకం అధికం కావడంతో యూరియా కొరత ఏర్పడింది. అయితే వ్యవసాయ అధికారులు, ఎరువుల విక్రయ డీలర్లు యూరియా అవసరాన్ని గుర్తించి నిల్వలు ఉంచుకోవడంలో అలసత్వం వహించడం వల్ల యూరియా కొరత ఏర్పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుందని తెలిసినా యూరియా నిల్వలు చేయకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని రైతులు అంటున్నారు. రామసముద్రం మండలంలో ప్రతి ఏడాది రబీ సీజన్ కంటే ఖరీఫ్‌లో వరి సాగు ఎక్కువగా ఉంటుంది. అయితే మండలంలో వరి సాగు టమోటా ధరపై ఆధారపడి ఎక్కువశాతం చెరువులు, కుంటల కింద టమోటా సాగు చేస్తారు. కాగా ఈ ఏడాది జూన్ జూలై నెలలలో టమోటా రెట్లు ఆశాజనకంగా లేకపోవడంతో టమోటా కాయలు అయిపోయాక చెట్లు పీకేసీ వరి సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది కంటే ఈ ఏడాది వరి సాగు పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఇందుకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాలు, ఎరువుల డీలర్ల దుకాణాలలో యూరియా నిల్వలు అధికంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వరి నాట్లు వేసినప్పటి నుంచి వెన్ను వచ్చే దశ వరకు సుమారుగా రెండునెలలు పలుసార్లు వరికి యూరియా పిచికారీ చేయాల్సి ఉంటుందని ఇందుకు సరిపడా యూరియా నిల్వలు ఉండేలా వ్యవసాయాధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొందరు ఎరువుల విక్రయ డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోదండ రామాలయంలో వరలక్ష్మీ వ్రతం



వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, శ్రావణకుమార్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్‌లు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ రంగమంటపంలో ఆశీనులను చేశారు. అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య వరలక్ష్మీవ్రతం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో వచ్చి వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు నవీన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ (ఆదివారం) ఉచిత వైద్యశిబిరంనిర్వహిస్తున్నామని ꠰ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభంలో ప్రజలు రోగాల బారీన పడకుండా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్యశిబిరం శంకరాపురం వీధిలోని మున్సిపల్ స్కూల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో గుండె సంబందిత, చిన్నపిల్లల, నరాలు, ఎముకలు సంబందిత వ్యాధులతో పాటు బీపీ, షుగర్, థైరాయిడ్, ఊపిరితిత్తులు, మెదడు, వెన్నముఖ, విషజ్వరాలు సంబందించిన వైద్యులు పాల్గొని చికిత్సలు అందిస్తారని తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రజలకు ఉచిత మెగా వైద్యశిబిరం కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, డీసీసీ సెక్రటరి యల్లయ్య, అబ్బాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరం కరపత్రాలను పంచుతున్న ఇర్ఫాన్‌బాషా

వైకల్య శాతం అనుసరించి ఉపకరణాలు



పీలేరులో శిబిరానికి హాజరైన ప్రత్యేక ప్రతిభావంతులతో అధికారులు

పీలేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వైకల్య శాతం అనుసరించి విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ఉచిత ఉపకరణాలు అందజేస్తుందని కడప, అన్నమయ్య జిల్లాల విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు ఆర్‌వీ కృష్ణకిశోర్ పేర్కొన్నారు. పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన ఉపకరణాల లబ్ధిదారుల ఎంపిక శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు కడప జిల్లాలో 22 శిబిరాలు నిర్వహించి ఉపకరణాలు అందించేందుకు 4700 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. జిల్లాలో 21 శిబిరాలకు ఇప్పటి వరకు 18 శిబిరాలు నిర్వహించామని, మిగిలిన మూడు శిబిరాలు కూడా పూర్తయ్యాక లబ్ధిదారుల మొత్తం సంఖ్య తేలుతుందన్నారు. శిబిరానికి హాజరవుతున్న విభిన్న ప్రతిభావంతుల వద్ద ఉన్న సదరం ధృవపత్రాల్లోని వైకల్య శాతాన్ని లెక్కలోకి తీసుకుని ఉపకరణాలు అందజే స్తామన్నారు. 86 శాతానికిపైగా వైకల్యం ఉన్న వారికే మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లు అందే అవకాశం ఉందన్నారు. ఉచిత ఉపకరణాల కోసం ఎంపికైన ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.5 వేలు మొదలుకుని రూ.47 వేలు విలువైన ఉపకరణాలు ఉచితంగా అందజేస్తుందన్నారు. జిల్లా వికలాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఉప సహాయ సంచాలకుడు శ్రీకాంత్, పీలేరు ఎంపీడీఓ శివశంకరయ్య, ఐఈడీఎస్ లలితకుమారి, ఐఈఆర్‌టీ ధరణీ జ, సీఆర్‌పీ మురళీధర్ రాజు, పీలేరు ఆదర్శ వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు పీవీ చలపతి, కార్యదర్శి కేవీ రమణ, సభ్యులు పాల్గొన్నారు.

కలకడ: అర్హులైన దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాటవారిపల్లె హైస్కూల్‌లో దివ్యాంగుల గుర్తింపు శిబిరం నిర్వహించారు. 76 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. అర్హులకు ప్రభుత్వం సరఫరా చేసే వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, వీల్ చైర్లు పంపిణీ చేస్తామని చెప్పారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

● టీడీపీలో చేరిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ



మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

ఒంటిమిట్ట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీ ఖాళీ అయ్యేలా కనపడుతోంది. ఇప్పటికే వైసీపీకి చెందిన ముఖ్య నేతలు రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో భారీగా చేరుతున్నారు. శుక్రవారం ఎంపీపీ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ బోగా గీతాదేవిలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చమర్తి జగన్‌మోహన్‌రాజుల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే మండలంలోని మలకాటిపల్లె గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. మరో రెండు రోజుల్లో ఇంకొంతమంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న పలు అభివృద్ధి పనులను చూసి టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమరా వెంకటనరసయ్య, నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, న్యాయవాది రామదాసు, గజ్జల శ్రీనివాసరెడ్డి, బోగా శంకరయ్య, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దిలీప్ పాల్గొన్నారు.

అండర్-22 జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

వాల్మీకిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-22 జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక వాల్మీకిపురంలో నిర్వహించారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెలెక్షన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, సెక్రటరీ రవిచంద్ర, ఎస్ఐ చంద్రశేఖర్, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, పీడీలు కిరణ్, రెడ్డివరప్రసాద్, సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

అండర్-22 బాలికల జట్టు

కె.హిమశ్రీ, కౌశల్య(మదనపల్లె), గాయత్రి, హర్షిత, స్వాతి, మమేత, జి.గాయత్రి (తరిగొండ), భవ్యశ్రీ (గుర్రంకొండ), హర్షిత, రేణుక(సీటీఎం), హిమజ, వక్షశ్రీ, ఆరీఫా, వర్షిత, శాన్విత(వాల్మీకిపురం).

అండర్-22 బాలుర జట్టు

కార్తికేయ, రెడ్డిశేఖర్, క్రిష్ణకౌశిక్, అరవింద్, తరుణ్‌కుమార్, నియాజ్ (వాల్మీకిపురం), చైతన్య, దీపేష్, మౌనీష్, వెంకటసాయి, నిహార్ (మదనపల్లె), హేమనాథ్(తరిగొండ) జిల్లా జట్లకు ఎంపికయ్యారు.



అండర్-22 జిల్లా బాస్కెట్‌బాల్ జట్లకు ఎంపికైన బాలబాలికలు

ప్రభుత్వ పాఠశాలల్లో... మెరుగైన విద్యా ప్రమాణాలు

● పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
● జిల్లా, మండలస్థాయిలో అకడమిక్ కమిటీల ఏర్పాటు



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి వివిధ పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికంగా బోధన, వసతులు కల్పిస్తోంది. అయినా విద్యా ప్రమాణాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవని కేంద్రం నుంచి వచ్చిన రెండు సంస్థల సర్వేల్లో స్పష్టమైంది. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సగం మందికి కూడికలు, తీసివేతలు కూడా రావడం లేదని, ఇంగ్లీష్ పదాలు చదవలేకపోతున్నారని నివేదికలు ఇచ్చాయి. ఈ నేప థ్యంలో మరింత మైవిధ్యంగా విద్యాప్రమాణాలు మెరుగుపరిచేలా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నారు. ఆ దిశగా అకడమిక్ కమిటీలను నియమించి, పాఠశాలలను పర్యవేక్షించాలని నిర్ణయించారు. కమిటీలను సైతం నియమించారు. కమిటీల పనితీరు, విద్యాప్రమాణాలు పెంపునకు తీసుకుంటున్న చర్యలపై రాష్ట్రస్థాయిలో సమీక్షించనున్నారు.

జిల్లాలో 3110 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో శాటిలైట్ పాఠశాలలు 121, ఫౌండేషన్ పాఠశాలలు 281, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 1840, మోడల్ ప్రైమరీ పాఠశాలలు 431, యూపీ పాఠశాలలు 37, ఉన్నత పాఠశాలలు 249, బేసిక్ ప్రైమరీతో కూడిన ఉన్నత పాఠశాలలు 102, మోడల్ స్కూల్‌తో కూడిన ఉన్నత పాఠశాలలు 49 ఉన్నాయి. వీటిలో విద్యాప్రమాణాల పెంపు, పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం జిల్లా, మండలస్థాయిలో అకడమిక్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.

కమిటీల పర్యవేక్షణ ఇలా...

జిల్లా స్థాయిలో డీఈఓ చైర్మన్‌గా, సమగ్రశిక్ష ఏపీసీ, ఏసీ, డీసీఈబీ కార్యదర్శి, ముగ్గురు ఎంఈఓలు సభ్యులుగా ఉంటారు. ప్రతి సబ్జెక్టుకు నలుగురు నిపుణులైన స్కూల్ అసిస్టెంట్ల చొప్పున 24 మంది టీచర్లను, ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5వ తరగతి వరకు పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీలో నలుగురు ఎస్‌జీటీ కేడర్‌లో నిపుణులైన టీచర్లకు అవకాశం కల్పించారు. మండల స్థాయిలోనూ నిరంతరం పర్యవేక్షణకు ఎంఈఓ-1, ఎంఈఓ-2, కాంప్లెక్స్ హెచ్‌ఎం, ముగ్గురు ఎస్‌జీటీలకు కమిటీలో అవకాశం ఇచ్చారు. జిల్లా కమిటీ సభ్యులు బృందాలుగా పాఠశాలలను పర్యవేక్షిస్తారు. విద్యార్థుల సామర్థ్యాలు, ప్రమాణాల పెంపునకు ఎలా బోధిస్తున్నారు.. ఎన్‌రోల్‌మెంట్, విద్యార్థులు, టీచర్ల హాజరు, పాఠశాలలకు వచ్చిన నిధులు, వాటితో ఎలాంటి వసతులు కల్పించారు.. తదితర వివరాలను పరిశీలిస్తారు. తనిఖీ చేసిన పాఠశాలలోని పరిస్థితులను కమిటీ రాసుకోవాలి. అకడమిక్ కమిటీలతో రాష్ట్రస్థాయిలో మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ సమీక్ష నిర్వహిస్తారు. కమిటీల పనితీరు, గుర్తించిన సమస్యలపై ఆరా తీస్తారు. ఆ దిశగా ఇప్పటికే కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలో అమలుకు అధికారులు కుస్తీ పడుతున్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకే...



విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు అకడమిక్ కమిటీ దోహ దపడు తుంది. సబ్జెక్టు నిపుణుల ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగు పడే అవకాశం ఉంటుంది. అలాగే ఉపాధ్యాయులు పిల్లలకు ఎలా బోధన చేస్తే సులువుగా నేర్చుకోగలరో అధ్యయనం చేసి.. విద్యార్థులకు బోధన చేసేందుకు ఉపయోగపడుతుంది. కమిటీ సమావేశాలు పాఠశాల సమయంలో కాకుండా పాఠశాల ముగిసిన తర్వాత (సాయంత్రం 4గంటల తర్వాత) నిర్వహించు కోవాలి. పాఠశాల సెలవు దినాలలో నిర్వహించాలి. ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని ఆ దిశగా అకడమిక్ కమిటీలు పనిచేయాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. త్వరలో మండల స్థాయి సమావేశాలు కూడా నిర్వహించి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తారు.

- షంషుద్దీన్, డీఈఓ

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి



ప్రమాదస్థలి వద్ద తీవ్రగాయాలతో శ్రీనివాసరెడ్డి

వల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి రోడ్డులో తోళ్లగంగనపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డి.శ్రీనివాసులరెడ్డి (46) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ పెద్ద ఓబన్న వివరాల మేరకు... వల్లూరు మండలం గంగాయపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి కడప కోర్టులో న్యాయవాదిగా పని చేస్తుండేవారు. ఈ క్రమంలో ఆయన శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంపై కడపకు వెళుతుండగా సత్యా గ్రీన్‌సిటీ వద్ద ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సుకు సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వైపు ఢీకొన్నాడు. దీంతో శ్రీనివాసులరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించగా.. చికిత్స చేస్తుండగా సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. శ్రీనివాసులరెడ్డికి భార్య వసంత, ఆరు నెలల పాప ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని గొర్రెలు మృతి



రోడ్డు పక్క మృతి చెందిన గొర్రెలు

ముద్దనూరు ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తాడిపత్రి రోడ్డులోని ఈద్గా సమీపంలో శుక్రవారం ఉదయం లారీ ఢీకొనడంతో 6 గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా.. ముద్దనూరు వైపు నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న లారీ ఈద్గా వద్ద రోడ్డు దాటుతున్న గొర్రెల మందపై దూసుకెళ్లింది. దీంతో జాఫర్ అనే వ్యక్తికి చెందిన 6 గొర్రెలు మృతి చెందాయి.

స్టాప్ బోర్డును ఢీకొని యువకుడికి గాయాలు



గాయపడిన మునీంద్ర

కమలాపురం రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మూడు రోడ్ల కూడలిలో స్వాగత తోరణం వద్ద ఏర్పాటు చేసిన స్టాప్ బోర్డును ద్విచక్రవాహనం ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన మునీంద్ర తన సొంత పనులు ముగించుకొని మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా మూడు రోడ్ల కూడలిలో ప్రమాదవశాత్తు స్టాప్ బోర్డును ఢీకొన్నాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ప్రాంతంలో రహదారి గోతులతో ప్రమాదకరంగా ఉందని.. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

● తప్పిన ప్రమాదం ● సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు



పొలాల్లోకి దూసుకుపోయిన కారు

కాశినాయన, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం పిడుగుపల్లె గ్రామాల మధ్య పోరుమామిళ్ల నుంచి గిద్దలూరు వెళ్లే ప్రదాన రహదారికి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. దీంతో స్తంభం విరిగి పడింది. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా ఉంది. అయితే కారు అలాగే పొలాల్లోకి దూసుకుపోవడంతో ప్రమాదం తప్పింది. కారు ముందు భాగం దెబ్బతింది. అదృష్టవశాత్తు కారులో ఉన్నవారు ఎలాంటి గాయాల బారిన పడకుండా సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. సమీప గ్రామమైన చెన్నారెడ్డిపల్లెలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతున్న క్రమంలో ఈసంఘటన చోటుచేసు కున్నట్లు సమాచారం.

ప్రైవేటు ఆస్పత్రులపై ఆకస్మిక తనిఖీలు

● నిబంధనలకు లోబడి సేవలు అందించాలి ● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత



ఆరోగ్యశ్రీ వార్డులో చికిత్స పొందుతున్న రోగుల రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారుల బృందం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలు, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలో వైద్యాధికారులు మూడు బృందాలుగా విడిపోయి ప్రతి బృందం సుమారు 30 ఆస్పత్రులను తనిఖీ చేసేలా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. ఈ మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు బృందం ఆస్పత్రులపై సమగ్ర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా డాక్టర్ల విద్యార్హత, రిజిస్ట్రేషన్, బయోమెడికల్ వేస్టేజీ నిర్వహణ, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, నోఅబ్జక్షన్ సర్టిఫికెట్, లైసెన్సులు, చికిత్స రేట్లు వంటి అంశాలపై అధికారులు పరిశీలించారు. కొన్ని ఆస్పత్రుల్లో రేట్ల ప్రదర్శన లోపం ఉన్నట్లు గుర్తించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్పష్టమైన బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రులలో స్టెబిలైజేషన్ పద్ధతులు, నర్సింగ్ సిబ్బంది అర్హత, రెఫరల్ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఐవీఎఫ్, ఐవీఐ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. పట్టణంలో అక్షయ ఆస్పత్రి, గాయత్రీ ఐవీఎఫ్ వంటి సెంటర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్నాయన్నారు. విశ్వల్యాపరోస్కోపీ, ఐవీఎఫ్ సెంటర్‌పై తనిఖీ నిర్వహించగా ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయి పూర్తిస్థాయిలో అనుమతులు వచ్చేవరకు ఆస్పత్రులలో ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయకూడదని, వైద్యసేవలు అం దించరాదని హెచ్చరించారు. ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్యానికి మాత్రమే పరిమితం కావాలని, ల్యాబ్‌లు, ఫార్మసీ వంటి సౌకర్యాలను సమకూర్చుకోరాదన్నారు. నాలుగు రోజుల్లో అన్ని ఆస్పత్రులకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేసి ఆరోగ్యశాఖ డాక్టరేట్‌కు వివరాలను పంపుతున్నట్లు వివరించారు.

పోలీసుల అదుపులో అత్యాచార నిందితుడు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

కలసపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గురువారం చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో పలువురిని విచారించారు. ఫోరెన్సిక్ సైంటిఫిక్ ఆఫీసర్ కిషోర్ కుమార్‌రెడ్డి ఆధారాలను సేకరించారు. కాగా, పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించినట్లు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నిందితుడికి కఠినశిక్షపడేలా అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బద్వేల్ సీఐ నాగభూషణం, కలసపాడు ఎస్‌ఐ తిమోతి, పోరుమామిళ్ల ఎస్‌ఐ కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు

కొండాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శివప్రసాద్‌రెడ్డికి రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. గండిలో శ్రావణశనివారం సందర్భంగా డ్యూటీ నిమిత్తం శుక్రవారం కొండాపురం నుంచి బైకులో వెళుతుండగా పులివెందుల సమీపంలోని రాయలపురం వద్ద బైక్‌ను ఆటో ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో బైక్ కిందపడటంతో అతనికి చేయి విరిగింది. చికిత్స నిమిత్తం పులివెందుల ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పెన్నాపరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మైలవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి శనివారం 10 వేల క్యూసెక్కుల నీటిని సోమశిల జలశయానికి పెన్నానది ద్వారా విడుదల చేశామని.. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైలవరం జలాశయ అధికారులు శుక్రవారం తెలిపారు. పెన్నా పరివాహక ప్రాంతాలు అయిన వేపరాల, దొమ్మరనంద్యాల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు పట్టణ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రజకులు, రైతులు, స్కూలుకు వెళ్లే విద్యార్థులు, మత్స్యకారులు నదికపరివాహక ప్రాంతంలో వెళ్లడం నిషేదించారన్నారు. నదిలోకి వెళ్లకుండా పిల్లలపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని మైలవరం ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాలదిన్నెపల్లెకు చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం సుబ్బిరెడ్డి ఇంటివద్ద రోడ్డు నిర్మాణం విషయమై జరిగిన ఘర్షణ నేపథ్యంలో మనస్థాపం చెంది విషద్రావణం తాగాడు. కాగా, సుబ్బిరెడ్డి కుమార్తె లక్ష్మీదేవి తన తండ్రి మృతిపై కొందరిపై అనుమానం ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పూర్తి కోణంలో విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

దువ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారెడ్డిపేట సమీపంలో శుక్రవారం పొలాల్లో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.4,600 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చినుకు పడితే చెరువే..

● కడప రోడ్డులో, ఎన్‌హెచ్ రోడ్డులో భారీగా నిలుస్తున్న వర్షపునీరు ● శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజల వినతి



ఎర్రగుంట్ల మార్కెట్ యార్డు కాంప్లెక్స్ వద్ద నిలిచిన వర్షపు నీరు

ఎర్రగుంట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎర్రగుంట్లలో ప్రధాన రోడ్లలో, వీధుల్లో డ్రైనేజీలు లేక నరకం అనుభవిస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి వేసిన నేషనల్ హైవేల్లో సైతం నీరు వెళ్లేందుకు సరైన డ్రైనేజీలు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపైనే నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండేళ్ల క్రితం ఎర్రగుంట్లలో వేసిన జాతీయ రహదారిలో కడపరోడ్డులో ఇరువైపులా డ్రైనేజీ నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాడు అధికారులు చేసిన తప్పిదాలకు పాలకులు కూడా వంత పాడటంతో ఈ పరిస్థితి దాపరించిందని ప్రజలు వాపోతున్నారు. ఎన్‌హెచ్‌కు ఇరువైపులా డ్రైనేజీకి ప్రతిపాదనలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారాన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అలాగే స్థానిక నిధులు భారీగా కేటాయించి టెండర్లు పూర్తయినా పనులు చేయించుకోలేని దుస్థితి ఏర్పడింది. దీంతో మంజూరైన పనులు కూడా ఆగిపోయి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

● తీవ్ర ఇబ్బందులు

కడప రోడ్డులోని మార్కెట్‌యార్డు కాంప్లెక్స్ వద్ద, పాత జేకే వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోతున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే భారీగా నీరు ఆగడంతో వాహనచోదకులకు, దుకాణదారులకు ఇబ్బందిగా మారింది. వర్షపునీరు నిలవడం వల్ల తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు వ్యాపిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

గండికోట నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల



మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి రెండు గేట్ల ద్వారా మైలవరం జలాశయానికి శుక్రవారం సాయింత్రం 5వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేసేందుకు ఈ నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో శుక్రవారం 15,800 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం గండికోట నుంచి సీబీఆర్‌కు 1,000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 15.63 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

చెన్నూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వరలక్ష్మీ వ్రత పర్వదిన సందర్భంగా ఆలయాలు భక్తజనంతో కిటకిట లాడాయి. తెల్లవారుజాము నుంచి అమ్మ వారి ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ప్రతి గ్రామంలో కుటుంబ సభ్యులు ఎంతో భక్తిగా నిర్వహించారు. బంధువులు, స్నేహితులు, చుట్టు పక్కల మహిళలకు వాయినాలు ఇచ్చారు.

వల్లూరు..: మండల పరిధిలోని ప్రతి ఇంటిలో వర మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పూలతో అమ్మవారికి అలంకరించి పలురకాల నైవే ద్యాలు, పండ్లను సమర్పించారు. పైడికాల్వ గ్రామం లో కొలువై ఉన్న శ్రీరాజ్యలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవ స్థానంలో వరలక్ష్మీ పూజను ఘనంగా నిర్వహి ంచారు. అనంతరం కలశస్థాపన చేశారు. గోపూజ నిర్వహించారు.తీర్థప్రసాదాలు అందించారు.

పెండ్లిమర్రి..: పొలతల ఆలయంలో శుక్రవారం సాముహిక వరలక్ష్మీ వ్రతాన్ని కన్నుల పండువలా నిర్వహించారు.వ్రతంలో పాల్గొన్న ముత్తైదువులకు ఆలయం తరుపున ఉచితంగా పూజా సామగ్రి, తీర్థ ప్రసాదాలను అంద చేయడంతో పాటు,అన్నదానం ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ కృష్ణా నాయక్,టీడీపీ నాయకుడు శిరిగిరెడ్డి రాజారెడ్డి పర్యవేక్షించారు.

సింహాద్రిపురం..: మండలంలోని నిడివెలగల ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. వరలక్ష్మీ వ్రత విశేషాలను భక్తులకు వివరించారు. లక్ష్మీదేవిని పలు రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. సింహాద్రిపురం, కసనూరు, నిడిల్లా, హిమకుంట్ల, అంకాళమ్మగూడూరు, చెర్లోపల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని వరలక్ష్మీ వ్రతం చేసుకున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కమల్‌నాథరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి దంపతులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సీకేదిన్నె..: మండలంలో వరలక్ష్మీవ్రతం పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారిని ఎంతో సుందరంగా అలంకరించుకుని పూజలు నిర్వహించి వాయినాలు సమర్పించారు.

వీరపునాయునిపల్లె..: మండలంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీవ్రతం వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. మహిళలుకలశంపై అమ్మవారిని రూపాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. చుట్టుపక్కల వారిని పిలిచి నైవేద్యం పంచిపెట్టారు.



పెండ్లిమర్రి, సింహాద్రిపురంలో వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

వరలక్ష్మీదేవిగా విజయదుర్గమ్మ దర్శనం





అలంకారంలో విజయదుర్గాదేవి అమ్మవారు, వరలక్ష్మీవ్రతం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కడప కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా నగర బిల్టప్ సమీపంలో శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో వైభవంగా వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున మహిళా భక్తులు హాజరై అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అమ్మవారి కాసు, కంకణం, కుంకుమ, ప్రసాదాన్ని అందించారు. అనంతరం ఉదయం 10గంటలకు సుమంగళి పూజ నిర్వహించారు. తదుపరి సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు.

తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కన అదుపు తప్పిన కారు

సీకేదిన్నె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు అదుపు తప్పి బోల్తాపడింది. కడప నుంచి రాయచోటివైపు వెళుతున్న కారు కొత్త రోడ్డు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డుపక్క గుంతలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఫీజురీయింబర్స్‌మెంటు వెంటనే ఇవ్వాలి

కమలాపురం రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.చంద్ర తెలిపారు. శుక్రవారం కమలాపురంలోని స్థానిక ప్రగతి కాలేజీ ఆవరణలో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ నెల 12న ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కమలాపురం ఏరియా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

నాలుకలపై నాట్యమాడిన పాండవోద్యోగ పద్యాలు

కడప కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి వేంకటకవులుగా ప్రసిద్ధులైన దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్లపిల్ల వెంకట శాస్త్రి రాసిన పాండవోద్యోగం నాటకంలో పద్యాలు ఆంధ్రదేశమంతా నాలుకలపై నాట్యమాడాయని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం చెళ్లపిల్ల వేంకటశాస్త్రి 156వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొదట శాస్త్రిగారి చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ఆటోలు ఏర్పాటు

చెన్నూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం గిరి ప్రదక్షిణకు వచ్చే ప్రజల కోసం కడప నగరంలోని ఎన్జీవో కాలనీలో గల మోర్‌మార్కెట్ పక్కనున్న వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పుష్పగిరి వరకు ఉచితంగా ఆటోలు ఏర్పాటు చేసినట్లు చెన్నూరు మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు ఆవుల బసిరెడ్డి తెలిపారు. ఉదయం 6 నుంచి ఎన్జీవోకాలనీలోని వేంకటేశ్వరస్వామి గుడి వద్ద ఆటోలను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆటోలు అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండు, సంధ్యా సర్కిల్, ఐటీఐ మీదుగా పుష్పగిరి వరకు ఉచితంగా గిరిప్రదక్షిణకు వచ్చే ప్రజలను తీసుకువచ్చి తిరిగి తిరుగు ప్రయాణంలో వేంకటేశ్వరస్వామి గుడి వద్దకు తీసుకువెళతాయన్నారు. అలాగే గిరి ప్రదక్షిణ చుట్టూ నడవలేని వయోవృద్ధుల కోసం అక్కడ కూడా ఆటోలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని శనివారం పౌర్ణమి నాడు గిరిప్రదక్షిణకు వచ్చే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఆశా యూనియన్ రాష్ట్రమహాసభను జయప్రదంచేయండి

కడప మారుతీనగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృతంగా ఉన్న ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కడపలో ఈ నెల 30, 31 తేదీల్లో తలపెట్టిన ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర , జిల్లా నాయకులు ఆశా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యమాత తిరునాళ్లు మహోత్సవాలను దిగ్విజయం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కడప వేళాంగణిగా ఖ్యాతిగాంచిన నగర రైల్వేస్టేషన్ సమీపంలో వెలసిన ఆరోగ్యమాత చర్చి తిరుణాల మహోత్సవాలు వచ్చే సెప్టెంబరు 9, 10 తేదీల్లో కన్నులపండువగా జరగనున్నట్లు ఆరోగ్యమాత చర్చి ఫాదర్ ఎండీ ప్రసాదరావు, ఫాదర్ డేవిడ్‌రాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆరోగ్యమాత చర్చి లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించిమాట్లాడారు. తిరుణాల మహోత్సవాల కార్యక్రమానికి ముందుగా కడప మేత్రాసనం పీఠాధిపతి సగినాల పాల్ ప్రకాశ్ హాసరై తిరుణాల ప్రార్థనల పతాకావిష్కరణ చేశారు.

ముమ్మరంగా టీడీపీ ప్రచారం



ఇంటింటి ప్రచారంలో జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి, మోట్నూతలపల్లెలో పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న బీటెక్ రవి

పులివెందుల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో మారెడ్డి లతారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని మడకశిర ఎమ్మెల్యే రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆర్.తుమ్మలపల్లెలోని ఎస్సీ కాలనీలో ఆయన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా కేడీసీసీ చైర్మన్ కేశవరెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దూకుడు పెంచిన ఇంటింటి ప్రచారం: ఇంటింటి ప్రచారంలో టీడీపీ నాయకులు దూకుడు పెంచారు. శుక్రవారం పులివెందుల మండలంలోని ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు పోటాపోటీగా ప్రచారం సాగించారు. అందులో కూటమి అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి యర్రబల్లె, మల్లికార్జునపురం గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అచ్చవెల్లి గ్రామంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి), కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి, లింగారెడ్డి, డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి తదితరులు ఇంటింటి ప్రచారంచేశారు.



ప్రచారం నిర్వహిస్తున్న రితీశ్‌రెడ్డి, బీటెక్ రవి

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక..: పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. పులివెందుల ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి), లింగారెడ్డి, బద్వేల్ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో మోట్నూతలపల్లె గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే నల్లగొండువారిపల్లెలో మూడు కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

కడప క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెలా రెండో శనివారం జరిగే విద్యుత్ లైన్లు , 33/11 కేవీ ఉప కేంద్రాల్లో మరమ్మతుల కార్యక్రమంలో భాగంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఎస్పీడీసీఎల్ (ఆపరేషన్) కార్య నిర్వాహక ఇంజనీరు హరిసేవ్యా నాయక్ ప్రకటనలో తెలిపారు. కడప టౌన్, ఈస్ట్ రూరల్ సెక్షన్, రిమ్స్ సెక్షన్, సీకేదిన్నె, పెండ్లిమర్రి, నందిమండలం సెక్షన్లు, చెన్నూరు, వల్లూరు, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడు తుందన్నారు.

పులివెందుల రూరల్..: పట్టణంలోని పలుప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నారెడ్డికాలనీ, ముద్దనూరు రోడ్డు, టీటీడీ కళ్యాణమండపం పరిసరా ప్రాంతాలలో శిథిలావస్థలో ఉన్నవిద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అవినీతి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

అఖిలపక్ష సమావేశంలో నేతల డిమాండ్



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష పార్టీల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థలో చెత్త పన్నుపై అవినీతికి పాల్పడిన వారి నుంచి దుర్వినియోగం చేసిన సొమ్ము రికవరీ చేయాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్, ఇతర పార్టీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చెత్త పన్ను అవినీతి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాల సమావేశం జరిగింది. నగరపాలక సంస్థలో పాలకవర్గం కుర్చీల కోసం కొట్లాడుతుంటే అధికార యంత్రాంగం నగరంలో వసూలు చేసిన పన్నులన్నీ ఇష్టానుసారంగా దుర్వినియోగం చేశారని వారు విమర్శించారు. చెత్త పన్ను అవినీతి 2020 సంవత్సరం నుంచి జరుగుతోందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం అవినీతి మీద ఒక నిజాయితీ కలిగిన ఐఏఎస్ అధికారిచేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు మాత్రమే కాకుండా కఠిన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ,కాంగ్రెస్ పార్టీ నేతలు సత్తార్, అలీఖాన్,సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు డబ్ల్యూరాము తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.

రహదారి భద్రత - ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కడప క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీ వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో రహదారి భద్రత - ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ డీకే జావీద్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాపిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు మీద ఒకరు చేసే తప్పు పక్కవారికి ప్రాణాపాయం కలిగించొచ్చన్నారు. హెల్మెట్ ధరించడం కేవలం చట్టానికే లోబడి కాదు అది మన భద్రత కోసం, మన కుటుంబాల భద్రత కోసం అన్నారు. మితిమీరిన వేగం, సెల్‌ఫోనులో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్స్, ఇవన్నీ ప్రమాదాలకు సంకేతమన్నారు. అలాగే రోడ్డు దాటే సమయంలో రెండువైపులా గమనిస్తూ అప్రమత్తంగా ఉంటూ దాటాలన్నారు. మహిళలు బైకుపై ప్రయాణించే సమయం లో చున్నీ లేదా చీర కొంగు వీల్‌కు చుట్టుకునే ప్రమాదం ఉందని, జాగ్రత్త వహించాలన్నారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ట్రాఫిక్ పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.



అవగాహనకల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

'పోలింగ్‌శాతం తగ్గించడానికి కుట్ర'

పులివెందుల రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో పోలింగ్‌శాతం తగ్గించడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా కొత్త పద్ధతులు వచ్చాయన్నారు. యర్రబల్లెలో ఉన్న ఓటర్లు నల్లపురెడ్డిపల్లెలో ఓటు వేయాలి, నల్లపురెడ్డిపల్లెలో ఉన్న వారు యర్రబల్లెలో ఓటు వేయాలి, నల్లగొండువారిపల్లె ఓటర్లు నల్లపురెడ్డిపల్లెలో ఓటు వేయాల్సి వచ్చిందన్నారు. ఈ మాదిరి ఎందుకు తీసుకొచ్చారో చెప్పాలన్నారు.ఎక్కడైన పోలింగ్‌బూత్‌లను మార్చడం చూశాంకానీ ఇపుడు ఓటర్లను మార్చడం ఇప్పుడే చూస్తున్నామన్నారు. ఈ పరిస్థితి ఎందుకు తెచ్చారు అంటే కేవలం పోలింగ్ శాతం తగ్గించడానికే అన్నారు. ఈ విషయం కలెక్టర్, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. గతంలో ఉన్న మాదిరే అనెక్షర్ -7ను ఉంచాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నామన్నారు.

గండిక్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి



పాపాఘ్నిలో కాల్వ పూడిక తీయిస్తున్న దృశ్యం, గండికి వచ్చిన రకరకాల పూలు

చక్రాయపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధి గాంచిన గండి క్షేత్రంలో అత్యంత వైభవంగా జరిగే శ్రావణమాసం మూడో శనివారం జరిగే మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. లక్షలాది మంది భక్తులు రానుండడంతో సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఉత్సవ కమిటటీ మెంబర్ వెంకటస్వామి, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సాయంత్రానికే గండికి భారీగా భక్తులు చేరుకున్నారు. అలాగే దేవస్థానంపూలతో ముంచెత్తారు. అందుకు రకరకాల పూలు చెన్నై నుంచి తెప్పించారు. రెడ్ ఆస్ట్రేలియా, చామంతి, పచ్చచామంతి, బంతి పూలు, లిల్లీపూలు తదితర రక రకాల పూలను కూడా తెప్పించి డెకరేషన్ చేస్తున్నారు. క్యూలైన్లు తాగునీటితో పాటు భక్తుల స్నానాల కోసం కాల్వల పూడిక తీయించడం చేస్తున్నారు. వచ్చే భక్తుల కోసం దాదాపు 30000 లడ్డు ప్రసాదాలు, 30వేల పులిహోర ప్యాకెట్లు కూడా ఏర్పాటుచేశారు.

సీఐ ఉలసయ్య, ఎస్ఐ రంగారావులతో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. విద్యుత్ అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చలువ పందిళ్ల లాంటివి కూడా వేశారు. ప్రధాన అర్చకుడు కేసరి,ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ గర్భాలయాన్ని పూల డెకరేషన్లు చేయించారు. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నారు. కొర్లపాడుఅంకిరెడ్డి, బిస్మిల్లాబాదుతో పాటు గోవిందమాల ఆంజనేయులు వారి ఆధ్వర్యంలో ఐదు కౌంటర్లు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వారితో పాటు దేవస్థానం కూడా భారీ ఎత్తులో అన్నదాన కార్యక్రమాలు చేపట్టడానికి అన్ని ఏర్పాట్లుచేస్తున్నారు.

వరాలతల్లి వరలక్ష్మికి ప్రత్యేక పూజలు


ప్రొద్దుటూరులో వరలక్ష్మీవ్రతం ఆచరిస్తున్న మహిళలు


ప్రొద్దుటూరులోని ఓ ఇంట్లో అలంకరణలో అమ్మవారు


రాజుపాళెంలో వ్రత పూజలో మహిళలు


చాపాడు, ఎర్రగుంట్లలో వరలక్ష్మీ పూజలో పాల్గొన్న మహిళలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరాలిచ్చే తల్లి వరలక్ష్మికి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వివిధ ఆలయాల్లో భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరాలతల్లి వరాలు ఇవ్వాలని తమ కోర్కెలు తీర్చాలని మహిళలు అమ్మవారిని వేడుకున్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వరలక్ష్మీ అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారికి నైవేద్యంతో అర్చించి మంగళహారతి ఇచ్చి తమను చల్లంగా చూడాలని వేడుకున్నారు. వాసవీ మాతకు విశేషపూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయం, రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

ఎర్రగుంట్లలో: స్థానిక ఏరువాకగంగమ్మ ఆలయంలో వరలక్ష్మీపూజ శ్రావణ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మహిళలతో మహాలక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చన చేయించి అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీచేశారు. అంకమ్మ ఆలయంలో కూడా సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీచేశారు.

రాజుపాలెంలో: శ్రావణమాసంలో విశిష్టమైన వరలక్ష్మి వ్రతాన్ని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాలలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని మహిళలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిఏటాలాగే సంజీవరాయస్వామి కళ్యాణ మండపంలో ఉచిత సామూహిక వ్రతాన్ని దేవస్థానం ఆధ్వర్యంలో మహిళలచే ఆచరింపజేశారు. వరలక్ష్మి వ్రతం ఆచరించడం వల్ల సౌభాగ్యాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యుడు నారాయణరెడ్డి, ఆలయ ఈవో రమణ, దుద్యాల సుబ్బిరెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో శుక్రవారం పలు దేవాలయాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగులకట్ట వీధి చౌడేశ్వరీ ఆలయం ఆవరణంలో భక్తులు వరలక్ష్మీ వ్రతం పూజలు చేశారు. అలాగే కుండావారి వీధి, శ్రీభద్రావతి భావనారుషి దేవాలయం నందు, కన్నెలూరు, మోరగుడి, తదితర గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతపూజలు నిర్వహించారు.

మైలవరంలో: మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామంలో చౌడేశ్వరీమాత ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీ వ్రత వేడుకలను మహిళా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సౌభాగ్యం కోసం వరలక్ష్మి వ్రత పూజలు చేస్తారని పురోహితులు వివరించారు.

కాశినాయనలో: మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీవ్రత వేడుకలను ప్రజలు సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. గొంటువారిపల్లె సమీపంలో వెలసిన నీలకంఠ ఆశ్రమం, నర్సాపురంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాలల్లో వరలక్ష్మీ వ్రతం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వచ్చిన భక్తులకు ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు మున్సిపాలిటీ,మండలంలో ప్రజలు వరలక్ష్మీ వ్రతం శుక్రవారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మహిళలు ఇళ్లలోనే అమ్మవారిని ప్రతిష్ఠించుకొని ప్రత్యేకంగా అలంకరించి ముత్తైదువలను పిలిచి తాంబూలాలు ఇచ్చారు.

చాపాడులో: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు శక్తిస్వరూపిణి అయిన భద్రకాళి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. లక్ష్మీపేట, కేతవరం, అల్లాడుపల్లె తదితర గ్రామాల నుంచి వచ్చిన మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానం ఈవో శ్రీనివాసులు, మాజీ ఛైర్మన్ వీరనారాయణ వసతులను ఏర్పాటు చేశారు.

దువ్వూరులో: దువ్వూరు మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. ప్రధానంగా అమ్మవారిని దర్శనం చేసుకుని పునీతులయ్యారు.

పోరుమామిళ్లలో : మండలంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు శుక్రవారం నిర్వహించారు. పోరుమామిళ్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో, వేణుగోపాలస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు.

ఖాజీపేటలో: మండల పరిధిలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహిళలు శుక్రవారం వరాలతల్లి వరలక్ష్మీ అమ్మవారికి వ్రతాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, చిత్రంలో భూపేష్‌రెడ్డి

ముద్దనూరు ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిలు పేర్కొన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం. ధృవా కన్సల్టెన్సీ మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు, పులివెందుల నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకుఎ జాబ్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు. ప్రధానంగా పులివెందులలో నిర్వహించాల్సిన మెగా జాబ్ మేళా పులివెందులలో జడ్పీటీసీ ఉప ఎన్నిక ఉన్నందున ముద్దనూరులో నిర్వహించారన్నారు.హైదరాబాద్‌లోని 40 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయన్నారు. అనంతరం భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 720 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా 325 మందిని ఎంపిక చేశారని 135 మందికి నియామక పత్రాలు అందించారన్నారు. 195 మందిని పరిశీలనలో ఉంచారన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్‌రెడ్డిలు యువతకు నియామక పత్రాలు అందించారు. జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగులకు మండల బీజేపీ నాయకులు మధుసూదనరెడ్డి, యువనేత గుణవంత్‌రెడ్డిలు ప్రాంగణంలో వసతులు, భోజన సౌకర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుసూదనరెడ్డి, యువనేత గుణవంత్‌రెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి,ఎస్‌వీ డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ అమర్‌చక్రధర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఎం నేతలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1121 కోట్లను వెంటనే గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 శాతం పైగా సర్పంచులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలే ఉన్నారని, వారు అప్పు తెచ్చి అభివృద్ధి పనులు చేసినా వాటికి బిల్లులు చెల్లించడంలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడత నిధులు పంచాయతీలకు విడుదల చేసినా రెండవ విడత నిధులు విడుదల చేయడంలేదన్నారు. సర్పంచుల గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సత్యనారాయణ, కార్యదర్శి వర్గ సభ్యుడు అన్వేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా కాలువల్లో వ్యర్థాల తొలగింపు పనులు


కాలువలో దిగి వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన మురుగునీటి కాలువల్లో వ్యర్థాల తొలగింపు పనులు వేగవంతం చేశారు. శుక్రవారం కమిషనర్ రవిచంద్రారెడ్డి పట్టణంలో జరిగే కాలువల్లో పూడికతీత పనులను స్వయంగా పర్యవేక్షించారు. వాహనాలు వెళ్లలేని చోట మనుషులను కాలువల్లోకి దింపి పూడిక తొలగింపు పనులు చేపడుతున్నారు. మడూరు చానల్ ప్రొద్దుటూరు దొరసానిపల్లె కొత్తపల్లె చానల్స్‌లో ఈ పూడిక తీతపనులు జరుగుతున్నాయి.

దోమల నియంత్రణకు ఫాగింగ్

ప్రొద్దుటూరు , ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) ప్రొద్దుటూరు పట్టణంలో దోమల నియంత్రణ కోసం మున్సిపల్ ప్రజాఆరోగ్య శాఖ అధికారులు ఫాగింగ్ చేపడుతున్నారు. శుక్రవారం స్థానిక వసంతపేట లోని ఆనాబంకు ఏరియాలో మున్సిపల్ వాహనంతో ఫాగింగ్ చేపట్టారు. పట్టణంలో ప్రతి వార్డులో ఫాగింగ్‌తో పాటు కాలువల్లో దోమల మందు ఎబేట్ ను పిచికారి చేసి దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా తెలిపారు.

ప్రభుత్వ పథకాల అమలుపై కేంద్ర బృందం పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఎర్రగుంట్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలుతీరుపై కేంద్ర బృందం శుక్రవారం చిలమకూరులోని గ్రామసంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రామ పంచాయతి పరిధిలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబందించిన రికార్డులను, పని దినాలను, పేమెంట్స్ తదితర అంశాలను పరిశీలించారు. సామాజిక పించన్లు అమలుపై అడిగి తెలుసకున్నారు. పీఎంజేఏవై పథకం కింద కట్టించిన ఇళ్లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో భారీ వర్షం


ఏరువాకగంగమ్మ ఆలయం వీధిలో భారీగా ఆగిన వర్షపు నీరు

ఎర్రగుంట్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. 60.2మిల్లీమీటర్లుగా వర్షపాతం నమోదు అయ్యింది. భారీ వర్షం కారణంగా వీధుల్లో భారీగా ఆగాయి. దీంతో ప్రజా జీవనానికి ఇబ్బందికలిగింది. కొన్ని వీధుల్లో మోకాటిలోతు నీరు ఆగింది. ప్రధాన రోడ్ల వెంబడి డ్రైనేజీ లేకపోవడంతో భారీగా వర్షపు నీరు రోడ్లపైనే ఆగింది. ఇది మురుగుగామారి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు, దుకాణదారులు వాపోతున్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయండి

పోరుమామిళ్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డువిస్తరణ పనులు వేగవంతం చేసి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని మానవ హక్కుల కమిషన్ నాయకులు గంగన్న, ఫణిరావులు తెలిపారు. పోరుమామిళ్లలో సిమెంటు రోడ్డు పనులు ఆలస్యం అవుతుండడం వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని స్కూలు పిల్లలు, చిన్న చిన్న వాహనాలలో వెళ్లాలంటే ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఈ ట్రాఫిక్‌లో దుమ్ము రేగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, వెంటనే అధికారులు చర్యలు తీసుకుని పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తులసిరెడ్డికి ఘన సన్మానం



ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడుగా నియమితుడైన డాక్టర్ ఎన్.తులసిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పీఎండీ నజీర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులసిరెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధిగా పార్టీ పటిష్ఠత కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఆయన సేవలను గుర్తించి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునకార్గే, రాహుల్‌గాంధీలు ఏపీ కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యునిగా నియమించారన్నారు. మహబూబ్‌బాష, మునవర్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

అలుగువంకలో సమృద్ధిగా నీరు

దువ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలోని అలుగు వంకలోకి సమృద్ధిగా నీరు చేరింది. పురాతన కాలం నుంచి ఆనకట్టగా పిలుచుకునే అలుగు వంకకు నీరు చేరడంతో ఈ ప్రాంతవాసులు హర్షం వెలిబుచ్చుతున్నారు. ఇక్కడ నీరు ఉండడంతో చుట్టుపక్కల బోరుబావుల్లో భూగర్భజలాలు పుష్కలంగా ఉండి సాగు, తాగునీటి కొరత తీరుస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

చౌడేశ్వరి అమ్మవారికి విశేష పూజలు


అలంకరణలో అమ్మవారు

బద్వేలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడమ్మ వీధిలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఆలయ కమిటీసభ్యులు, నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జమ్మలమడుగు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజగోపాల్ తెలిపారు. రెండవ శనివారం మరమ్మతుల పనుల కారణంగా జమ్మలమడుగు మున్సిపాలిటీతోపాటు మండలంతోపాటు మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సబ్‌డివిజన్ పరిధిలోని ప్రజలు సహకరించాలని ఏడీఈ కోరారు.

ఎర్రగుంట్లలో: ఎర్రగుంట్ల సబ్‌స్టేషన్ పరిధిలో ని శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ లైన్లలో మెయింటెన్స్ పనుల కారణం గా ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుందన్నారు. ఎర్రగుంట్ల మున్సిపా లిటి పరిధిలోని ముద్దనూరు రోడ్డు, కడప రోడ్డు, వేంపల్లిరోడ్డు, రాణీవనం, వినాయ కనగ ర్, సుందరయ్యనగర్, ప్రొద్దుటూరురోడ్డు, ఎస్టేట్ ఏరియాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలో శనివారం విద్యుత్ సరఫ రాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధి కారులు రామభద్రయ్య, నాగేంద్రలు శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగరం ఫీడర్, మండలంలో నంద్యాలపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్ ఫీడర్, జంగంపల్లి ఫీడర్, ఏకర్లపల్లె ఫీడర్, శెట్టివారిపల్లె ఫీడర్‌లలో మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరా ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉండదని అధికారులు తెలిపారు. ఇందుకు వినియోగదారులు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని వారు కోరారు.

అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్


ఎమ్మెల్యే వరదకి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అనుబంధం, ఆత్మరక్షణకు ప్రతీక రక్షాబంధన్ అని బ్రహ్మకుమారీలు శాంత, సౌజన్యలు తెలిపారు. శుక్రవారం రక్షాబంధన్ పండుగను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే నంద్యాలవరదరాజులరెడ్డి, డీఎస్పీ పి.భావన, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, కౌన్సిలర్ పిట్టా బాలాజీ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గురివిరెడ్డి దంపతులు, లైఫ్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ చెన్నకేశవరెడ్డి దంపతులు, వన్‌టౌన్ ఎస్‌ఐలకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ఆచారంలో రక్షాబంధనం పండుగ విశిష్టమైనదన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: మానవీయ విలువలకు, సనాతన సాంప్రదాయాలకు ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని ఆర్టీపీపీ ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బీకే సౌజన్య పేర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా ముందస్తుగా శుక్రవారం ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావుకు రాకీ కట్టి శ్రీకృష్ణుని జ్ఞాపికను అందజేశారు. అలాగే కలమల్ల ఎస్‌ఐ సునీల్ కుమార్‌రెడ్డికి, ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ శ్రీనివాసులుకు రాఖీని కట్టారు.

జమ్మలమడుగులో: ప్రతి ఒక్కరు వ్యసనాల నుంచి దూరంగా ఉన్నప్పుడే వారి జీవితం సంతోషంగా ఉంటుందని జమ్మలమడుగులో బ్రహ్మకుమారీ ఉమ సూచించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జమ్మలమడుగు పట్టణంలో రాఖీ పౌర్ణమి శుభ సందర్భంగా పలుచోట్ల ఉద్యోగులకు, కార్మికులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని తెలియజేశారు. జీ అనంతరం ఆర్టీసీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి మంచి మార్గంలో వెళ్లేందుకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు, ఆర్టీసీ కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

ఎర్రగుంట్ల, ఆగస్ట 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కదిరివారిపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.05గంటలకు యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ ప్రాణప్రతిష్ఠ కళాన్యాసం, గోదర్శనం, కూష్మాండ విచ్ఛేదనం మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు. సాయంత్రం 5.30గంటలకు సీతారాముల కల్యాణోత్సమహోత్సవం, గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

బద్వేలుటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నాలుగురోడ్ల కూడలిలో లారీ కారును ఢీ కొంది. వెంటనే అప్రమత్తమైన కారు డ్రైవర్ కారును పక్కకు తీసుకువెళ్లడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. దీంతో కారులోప ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

వివాహ వేడుకలకు హాజరైన రాజకీయ ప్రముఖులు


టీడీపీ నాయకుడు మురుకూటి విజయకుమార్‌రెడ్డి కుమారుని వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రాజకీయ ప్రముఖులు

పోరుమామిళ్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రమైన పోరుమామిళ్లలోని పద్మావతి కళ్యాణ మండపంలో టీడీపీ నాయకుడు మురుకూటి విజయకుమార్‌రెడ్డి, లక్ష్మీదేవిల కుమారుడు డాక్టర్ సాయికుమార్‌రెడ్డి, డాక్టర్ సౌందర్యరెడ్డి వివాహ వేడుకలకు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. బద్వేలు టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివా రెడ్డి, బద్వేలు కాంగ్రెస్‌పార్టీ మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, కూటమి నాయకుడు బొజ్జ రోశన్న ఈ వివాహవేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. శుక్రవారం తెల్లవారుజామున వివాహం జరిగింది. ఈ కార్యక్రమానికి కాశినాయన మండల సహకార సంఘం ఛైర్మన్ చిన్నగుర్విరెడ్డి, పోరుమామిళ్ల సహకార సంఘం ఛైర్మన్ కల్లూరు వెంకటక్రిష్టారెడ్డి, టీడీపీ నాయకులు కొండా రామక్రిష్టారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ సాధనకారి రంతు, బి.కోడూరు మండల నాయకుడు రామచంద్రారెడ్డితో పాటు పోరుమామిళ్ల ప్రాంత పుర ప్రముఖులు పాల్గొన్నారు.

వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బద్వేలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంతో పాటు వారికి ఇళ్ల స్థలాలు, బంజరు భూములు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృత్తిదారులకు ప్రభుత్వం ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలని తదితర డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో చేతివృత్తిదారుల సంఘం నాయకులు నాగరాజు, సీపీఐ రూరల్ కార్యదర్శి ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

జమ్మలమడుగు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు జె.భాస్కర్ కోరారు. శుక్రవారం జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో జరిగిన దళిత యువకుడిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా దళితులపై దాడులు, అరాచకాలు, మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు గోపాల్‌దాస్, రాజశేఖర్, పెద్దముడియం మండల అధ్యక్షుడు ఓబులేసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరాటంలో దళిత సమాఖ్య ముందుంటుంది

ప్రొద్దుటూరు , ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : దళిత బహుజనుల హక్కుల కోసం దళిత సమాఖ్య ఎల్లప్పుడు ముందుండి పోరాడుతుందని ఏపీ దళిత సమాఖ్య అధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ తెలిపారు. శుక్రవారం దళిత సమాఖ్య 23 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యార్థి అనాథ శరణాలయంలో విద్యార్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేణు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..
తప్పని ప్రయాణం



దువ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత వాసులు ప్రమాదమని తెలిసినా ఆటోలో ప్రయాణిస్తున్నారు. ఎప్పుడు ఏమి జరగు తుందో తెలియని వారు ఏదో రకంగా ఇంటికి చేరాలన్న ఆతృతతో ఆటోపైన కూడా కూర్చొని ప్రయణం చేస్తుంటారు. దువ్వూరు మండలంలో ఆటోలు నడుపుతూ జీవనం సాగించేవారు అధికంగా ఉన్నారు. వారు ఆయా గ్రామాలకు ప్రయాణికులను పొలాల పనులకు వెళ్లే కూలీలను నిత్యం చేరవేస్తుంటారు. డ్రైవర్‌కు ఇరువైపుల జనాలను కూర్చొబెట్టుకుని నడిపే సమయంలో స్టీరింగ్ తిప్పే వీలులేకుండా ఉంటుందనడంతో అతిశయోక్తి లేదు. ఇలా చాలా మంది కిక్కిరిసిన జనాలతో ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఆ సమయంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. తద్వారా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారనడంలో అతిశక్తియోక్తి లేదు. ఇటువంటి ప్రమాదకర ప్రయాణాలపై పోలీసు గస్తీ పెంచి నివారణ మార్గాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.